RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 18 మంగళవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 195 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | TUESDAY AUGUST 18 2026 | VOL:16 | ISSUE: 195 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# మాది సామాజిక న్యాయం

- వాళ్లు రక్తపిశాచులు...సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు
- కేసీఆర్‌ను సైతం తీసుకురావాలని కేటీఆర్, హరీశ్‌లకు విజ్ఞప్తి
- ఆయన విలువైన సూచనలిస్తే రాష్ట్రానికి ఉపయోగం
- నా లెక్కలన్నీ పక్కా చెబుతాను..ఎవరి పాలనేంటో అక్కడే తేల్చుకుందాం
- పరకాల సభలో సీఎం రేవంత్‌రెడ్డి..ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం



**వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

'మాజీ సీఎం కేసీఆర్‌ది కుటుంబ న్యాయం.. తమది, తమ పార్టీది సామాజిక న్యాయం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో వాళ్ల కుటుంబ సభ్యులకు పదవులిస్తే.. తాము మాత్రం సామాజిక సూత్రాన్ని పాటించామని తెలిపారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ్ాలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు ఇచ్చుకున్నాడని గుర్తు చేశారు. కానీ.! తాను మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆడబిడ్డలైన సీతక్క, కొండా సురేఖలను మంత్రిపదవుల్లో కూర్చోబెట్టామని తెలిపారు.కేసీఆర్ ఎర్రబెల్లికి మినిస్టర్ పదవి ఇస్తే.. తాను దళితుడైన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ని మంత్రిని చేశానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కవితను ఎంపీ చేస్తే తాను మాత్రం ఎస్సీ ఆడబిడ్డ అయిన కడియం కావ్యను పార్లమెంట్‌కు పంపానని వివరించారు. యశస్విని ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపానని తెలిపారు. కేసీఆర్ తన సడ్డకుని కొడుకు సంతోష్‌రావును ఎంపీ చేస్తే తాము మిత్ర ధర్మం పాటించి వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు పంపామని తెలిపారు. ఉద్యమకారుడైన కోదండరామ్‌కి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. కేసీఆర్ మాత్రం తన కొడుక్కి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు తాము బీసీ బిడ్డ అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను

(మిగతా 2వ పేజీలో..)

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!



**'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా**
**24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు**
**ఖాతాలో ప్రస్తుతం 62 పోస్టులు**
**ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారో లేని స్పష్టత**
**ఈ నెలలోనే ప్రారంభమైన అకౌంట్**

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది.'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది: హరీశ్ రావు

**జాబితా నుంచి సీఎం ఇంటిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ**
**నిషేధిత ఆస్తుల జాబితాపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**
**సామాన్యుల పరిస్థితి ఏమిటన్న హరీశ్ రావు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,

(మిగతా 2వ పేజీలో..)



## విద్యార్థుల సమయాన్ని వృథా చేస్తున్నారు.. యూజీసీ–నెట్ పరీక్షల రద్దుపై రాహుల్ ఫైర్

**మూడు సబ్జెక్టుల యూజీసీ-నెట్ పరీక్షలు రద్దు**
**ఎన్‌టీఏపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం**
**"తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?" అని ప్రశ్న**
**విద్యార్థుల సమయం, డబ్బు వృథా చేస్తున్నారని విమర్శ**
**ప్రశ్నపత్రాలు లీకయ్యాయా? అని కేంద్రాన్ని నిలదీత**
**ఎన్‌టీఏలో జవాబుదారీతనం ఉండాలని డిమాండ్**



యూజీసీ–నెట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. "ఎన్‌టీఏ తప్పు చేస్తోంది.. దానికి విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన విద్యార్థులు.. మళ్లీ దాని కోసం సమయం, డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థుల విలువైన సమయాన్ని ఎన్‌టీఏ వృథా చేస్తోందని విమర్శించారు.జూన్ 22 నుంచి 30 మధ్య సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ–నెట్ పరీక్షలు జరిగాయని రాహుల్ గుర్తుచేశారు. దాదాపు రెండు నెలల తర్వాత ఈ మూడు పరీక్షలను రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల్లో తప్పులు చేయడమే కాకుండా.. గతంలో

(మిగతా 2వ పేజీలో..)

## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు.. ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక

**22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు**
**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని సూచన**
**22ఏలో ఉందని దరఖాస్తు తిరస్కరించొద్దని ఆదేశం**
**భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలన**
**రికార్డులు పూర్తిగా తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలని ఆదేశం**

22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

**ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా**
**స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా**
**14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్**

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి

(మిగతా 2వ పేజీలో..)



## ఏపీపై ఎల్ నినో పంజా.. తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ

**రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న చంద్రబాబు**
**నవంబర్ వరకు అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంచనా**
**శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా తగ్గిన నీటి ప్రవాహం**
**నీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్న సీఎం**

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై

(మిగతా 2వ పేజీలో..)



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## విద్యార్థుల సమయాన్ని వృథా చేస్తున్నారు.. యూజీసీ–నెట్ పరీక్షల రద్దుపై రాహుల్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నలను మళ్లీ ఇచ్చారని ఆరోపించారు. పరీక్ష కోసం దరఖాస్తు చేసి, ఫీజులు కట్టి, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లిన వేలాది మంది అభ్యర్థులు ఇప్పుడు సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తోందని పేర్కొన్నారు."ఇది విద్యార్థులకు పరీక్ష మాత్రమే కాదు. వారి డబ్బు, సమయం, మానసిక ప్రశాంతతను కూడా దెబ్బ తీస్తోంది. చివరకు ఉద్యోగం కూడా దక్కడం లేదు" అంటూ రాహుల్ విమర్శించారు. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లో తాను విద్యార్థులతో మాట్లాడినప్పుడు కూడా ఇదే విషయాన్ని చెప్పానని తెలిపారు. దేశంలో విద్యా వ్యవస్థ కంటే విద్యార్థుల నుంచి డబ్బు, సమయం పిండుకునే వ్యవస్థగా పరిస్థితి మారిందని ఆరోపించారు. అసలు ప్రశ్నకు ఎన్‌టీఏ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. పరీక్షకు ముందే ప్రశ్నపత్రాలు లీకయ్యాయా? అని ప్రశ్నించారు. పరీక్షల్లో వరుసగా తప్పులు జరుగుతున్నా బాధ్యులపై చర్యలు ఎందుకు ఉండటం లేదని నిలదీశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనని, ఎన్‌టీఏ ఉన్నతాధికారులూ బాధ్యత వహించాలని అన్నారు. సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాహుల్ చెప్పారు. తప్పు విద్యార్థులది కాదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు.ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు.మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.

## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు.. ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు.నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.



# మాది సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించామని అన్నారు. ఈ రకంగా కేసీఆర్ హయాంలో ఆయన కుటుంబానికే న్యాయం జరిగితే తమ పార్టీ హయాంలో సబ్బండ వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని సీఎం వివరించారు.

సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు..

అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్, హరీశ్‌రావు పదే పదే అడుగుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిపై సెప్టెంబర్ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తేల్చుకుందా మని బీఆర్ఎస్ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. నా లెక్కలన్నీ పక్కా చెబుతానని, సుమారు ఈ మూడేండ్ల పాలనలో మేం చేసిన అభివృద్ధిని, మీరు చేయలేని పనులను పూర్తిస్థాయిలో చర్చిద్దా మన్నారు. ఈ సమావేశాలకు కేటీఆర్, హరీశ్‌రావులే కాకుండా కేసీఆర్ ను సైతం తీసుకురావాలని కోరారు. ఆయన సలహాలు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయని అన్నారు. కేసీఆర్ నాకు రాష్ట్రాన్ని అప్పగించిన సమయంలో 8లక్షల11వేల కోట్ల అప్పులను అప్పగించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంపై రూ.6500కోట్ల అప్పుల భారమే ఉండేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 8లక్షల11వేల కోట్లకు అప్పులు పెరిగాయన్నారు. లక్ష రూపాయలు రుణ మాఫీ చేస్తామని కేసీఆర్ రైతులను మోసం చేశారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 25లక్షల మంది రైతులకు 2లక్షల రుణమాఫీలో భాగంగా 25వేలా 617కోట్లను రైతుల ఖాతాల్లో వేసి రుణ విముక్తులను చేశామన్నారు. రూ.36వేల కోట్ల నిధులను రైతుభరోసాకు ఇచ్చామన్నారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30వేల కోట్లను రైతుల ప్రయోజనార్థం ఖర్చు పెడుతున్నామన్నారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదువులు ఇచ్చామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్స్, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా చేసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ ధృతరాష్ట్రుడా ?

కేసీఆర్ బిడ్డ కవితకు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని కర్కోటకుడైన అన్న కేటీఆర్ కవితను మెడలు పట్టి బయటకు నెట్టారని, దీన్ని సరిదిద్దాల్సిన కన్నతండ్రి కేసీఆర్ ధృతరాష్ట్రుడిగా ప్రేక్షకపాత్ర వహించారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరెలను ఎన్నడన్న కట్టుకున్నారా..చేండ్లలో అడవి పందులను బయపెట్టడానికి ఆ చీరెలను కట్టారని, కానీ మేము ఇచ్చిన పాలపిట్ట చీరెలు కట్టుకుని వచ్చిన మహిళలకు అన్నగా నేను ఎంతో సంతోష పడుతున్నానని అన్నారు.

నిరుద్యోగులు రెచ్చిపోవ్వొదు

నిరుద్యోగులు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పటి వరకు 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ కూడా వేశామన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో గరిష్ట వయోపరిమితిని కూడా పెంచామని, ఈ విషయాన్ని నిరుద్యోగులు గ్రహించాలని కోరారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియమాకాలు చేయలేదన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి 1200మంది యువకులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారకులయ్యారని అన్నారు. రెచ్చగొట్టాలి...మంది పిల్లలను చంపగొట్టాలనే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఇటీవల బీఆర్ఎస్ నేతలు రక్తదాన శిబిరం నిర్వహించారని, ఇందులో కేసీఆర్ గానీ, అతని కుటుంబ సభ్యులు ఎవరూ రక్తదానం చేయలేదన్నారు. కార్యకర్తలు మాత్రం రక్తదానం చేశారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు రక్త పిశాచాలుగా మారారని, హరీశ్‌రావు, కేటీఆర్,ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌రావు, సంతోష్‌రావులు ఎందుకు రక్తదానం చేయలేదని ప్రశ్నించారు. కాకలు తీరిన నాయకుడని చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్‌రావును చిన్న అమ్మాయి యశస్విని 50వేల మెజార్టీతో ఓడించి బండకేసి కొట్టిందన్నారు. ఇది నా విజయమో.. యశస్విని విజయమో కాదని, ఇది ప్రజల విజయమని అన్నారు. రైతు, మహిళల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నామని, నిండు మనస్సుతో 2029లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

హైదరాబాద్ తర్వాత వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి పొంగులేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రూ.300కోట్లకు పైగా ఖర్చు పెట్టి మామునూరులో భూసేకరణ చేసి ఆ భూమిని ఎయిర్‌ఫోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియాకు అందించినట్టు తెలిపారు. రానున్న రెండేండ్లలో ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణం పూర్తి చేసి విమానాలు తిరిగేలా చేస్తామన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. 8లక్షల కోట్ల అప్పు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 80వేల ఇండ్లను కూడా నిర్మించలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూడేండ్లలో 8లక్షల ఇండ్లను పూర్తి చేసిందన్నారు. జైశంకర్‌సార్ స్వగ్రామం అక్కంపేటను గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ గ్రామంగా చేయలేకపోయిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అక్కంపేటను రెవెన్యూ గ్రామం చేశామని తలిపారు. పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి 30ఏండ్ల కుర్రాడిగా పని చేస్తున్నారని అన్నారు.

మంత్రి సురేఖ దూరం

సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి కొండా సుస్మితపటేల్ పోటీ చేస్తారని కొండా మురళీధర్‌రావు ప్రకటన చేశారు. ఈ సమయంలో పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరడంతో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఈ కార్యక్రమానికి హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు మొలుగూరి భిక్షపతి హాజరుకాలేదు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

(మొదటి పేజీ తరువాయి)

ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## ఏపీపై ఎల్ నినో పంజా.. తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 2026 జూన్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో 867 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 557 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయని తెలిపారు. జులై నెలలో కొన్ని జిల్లాల్లో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం చొప్పున లోటు కొనసాగవచ్చని హెచ్చరించారు. అయితే, డిసెంబర్‌లో మాత్రం 1 శాతం అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని అన్నారు.ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాలు, ప్రాజెక్టులలో నీటి మట్టాలు వేగంగా అడుగంటుతున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయానికి ఈ సీజన్‌లో 753 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 214 టీఎంసీలు మాత్రమే వచ్చిందని సభకు తెలిపారు. ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలోని రిజర్వాయర్లు నిండిన తర్వాతే మనకు నీరు విడుదల చేస్తారని, ఈ కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోయిందని వివరించారు. కృష్ణా బేసిన్‌తో పాటు గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. నీటి సమస్యలు కేవలం రాష్ట్రాల మధ్యే కాకుండా గ్రామాలు, దేశాల మధ్య కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయని, కావేరి జలాల వివాదమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణ, వృథాను అరికట్టడంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

ఆగస్టు | మంగళవారం | 18 | 2026



# బీసీలకు సామాజిక న్యాయం, ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ అవసరం

**● విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, సబ్సిడీలు, సామాజిక భద్రతపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి: డాక్టర్ సిపాన గుణవతి**

**విశాఖపట్నం: ఆగస్టు 17**

దేశ జనాభాలో బీసీలు సుమారు 52 శాతంగా ఉన్నప్పటికీ, విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో వారికి తగిన ప్రాధాన్యత లభించడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సిపాన గుణవతి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారుబీసీల సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక బీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్నప్పటికీ, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంటే విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత తదితర అంశాలను సమగ్రంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల కోసం అమలు చేస్తున్న విద్యా స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలు, ఉన్నత విద్యా సహాయం, స్వయం ఉపాధి రుణాలు, సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని డాక్టర్ గుణవతి సూచించారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పథకాలపై సరైన అవగాహన లేక అనేక మంది అర్హులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారని అన్నారు.

**బ్యాంకుల వద్ద బీసీ లబ్ధిదారులకు ఇబ్బందులు తొలగించాలి**

ముఖ్యంగా స్వయం ఉపాధి పథకాల కింద రుణాలు, సబ్సిడీలు పొందేందుకు బ్యాంకులను ఆశ్రయించే బీసీ యువత, మహిళలు అనవసర జాప్యం, తిప్పలు, దరఖాస్తుల పెండింగ్ వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు కీలక భాగస్వాములుగా వ్యవహరించాల్సి ఉందని, అర్హులైన లబ్ధిదారులను అనవసరంగా తిప్పడం, కారణం లేకుండా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు వస్తే ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.బ్యాంకు అధికారుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, అనవసర జాప్యం లేదా నిబంధనలకు విరుద్ధమైన చర్యలు విచారణలో రుజువైతే, సంబంధిత అధికారులపై వర్తించే నిబంధనల ప్రకారం క్రమశిక్షణాత్మక, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని డాక్టర్ గుణవతి డిమాండ్ చేశారు. అదే సమయంలో అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి నిబంధనల ప్రకారం పారదర్శకంగా రుణాలు, సబ్సిడీలు అందేలా బ్యాంకులపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవాలి**

బీసీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల్లో బీసీల విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆమె కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు బీసీల సమస్యలపై కేంద్ర



ప్రభుత్వంతో సమిష్టిగా చర్చించి, ప్రత్యేక బీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బీసీలకు మెరుగైన విద్యా--ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయం, సామాజిక భద్రత వంటి అంశాలపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.బీసీలకు కేవలం సంక్షేమ పథకాలు ప్రకటించడం మాత్రమే కాకుండా, విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు, సామాజిక రంగాల్లో గౌరవప్రదమైన ప్రాతినిధ్యం మరియు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని డాక్టర్ సిపాన గుణవతి స్పష్టం చేశారు."బీసీలకు పథకాలు ప్రకటించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదు. ఆ పథకాల సమాచారం ప్రతి బీసీ కుటుంబానికి చేరడం, అర్హులైన వారికి ఎటువంటి వివక్ష, జాప్యం, ఇబ్బందులు లేకుండా ప్రయోజనం అందడం, బీసీలకు సామాజిక గౌరవం మరియు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది" అని డాక్టర్ గుణవతి పేర్కొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (దేశ టైమ్స్):**

ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16, 2026లోగా సమర్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా జాబితా, గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై వివరించారు. 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా జాబితాభారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా రూపొందించామని చెప్పారు. ఇందులో 5,24,894 మంది పురుషులు, 5,60,973 మంది మహిళలు, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు.ముసాయిదా జాబితాలో 1,33,004 మంది (12.24 శాతం) ఓటర్లను అనామలీస్‌గా, 43,131 మంది (3.97 శాతం) ఓటర్లను మ్యాపింగ్ కాని వారిగా గుర్తించినట్లు తెలిపారు. మొత్తంగా 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న వారు పత్రాలు సమర్పించాలి నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాలో పేరు పరిశీలించుకోవాలి ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని కలెక్టర్ కోరారు. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా బూత్ స్థాయి అధికారి (BLO), సహాయ ఎన్నికల నమోదు అధికారి (AERO) లేదా ఎన్నికల నమోదు అధికారిని (ERO) సంప్రదించాలని సూచించారు.అర్హత కలిగిన కొత్త ఓటర్లు ఫారమ్-6 ద్వారా సెప్టెంబర్ 16లోగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు, ఏ శాసనసభ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6తో పాటు తాజా ఫొటో, వయస్సు ధ్రువీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.చనిపోయిన లేదా






డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలకు ఫారమ్-7, మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, ఓటరు గుర్తింపు కార్డులో వివరాల సవరణకు ఫారమ్-8 వినియోగించుకోవచ్చని వివరించారు.సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాటిపై నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు.అక్టోబర్ 19న తుది జాబితాఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం 2026 అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా సహకరించాలని కోరారు.ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం సంబంధిత బీఎల్ఓ, ఏఈఆర్ఓ, ఈఆర్ఓలను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.సమావేశంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో నాగుల పంచమి వేడుకలు

**రుద్రంగి ఆగస్టు17(దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని నాగుల పంచమి సందర్భంగా ఆలయాలు ఉదయం నుండే భక్తులతో కిటకిటలాడయి వివిధ ఆలయాల్లో ఉన్న పుట్టలలో పాలు పోసి మహిళలు నాగదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుండే గండి వెంకటేశ్వర ఆలయం,శివాలయం, అయ్యప్ప గుడి,పెద్దమ్మగుడి,మహాలక్ష్మి విధిలో,ఉన్న పుట్టాల వద్ద మహిళలు భక్తి శ్రద్ధలతో పాలు పోసి నాగదేవతను పూజించారు.శ్రావణమాసం అంటేనే వ్రతాలకు పూజలకు ప్రత్యేకత అని శ్రావణమాసం లో వచ్చే నాగుల పంచమి విశిష్టత గొప్పదని ఇంటిల్లి పది పుట్టాలలో పాలు పోసి నాగదేవతను పూజించడం ఆనవాయితీ అని అన్నారు.నాగుల పంచమి రోజున నాగదేవతను పూజించడం వల్ల జాతకంలోని నాగదోషాలు కాలసర్ప దోషాలు తొలగిపోయి కుటుంబానికి ఆయురారోగ్యాలు సిరిసంపదలు కలుగుతాయని అన్నారు.పాడిపంటలతో ప్రజలందరూ బాగుండాలని నాగదేవతను పూజించినట్టు తెలిపారు.

## బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల,గ్రామ కమిటీలు ఎన్నిక

**రుద్రంగి ఆగస్టు17(దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల, గ్రామ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీలను ప్రకటించారు.రుద్రంగి మండల బీఎస్పీ అధ్యక్షుడిగా దయ్యాల ఉదయ్, ఉపాధ్యక్షుడిగా ఏనుగుందుల సతీష్, ప్రధాన కార్యదర్శిగా పోసు తిరుపతి, కోశాధికారిగా కట్కూరి వినోద్, సలహాదారుడిగా కాదాసు అనిల్ ను నియమించారు.అదేవిధంగా రుద్రంగి గ్రామ బీఎస్పీ కమిటీ అధ్యక్షుడిగా నల్ల నవదీప్, ఉపాధ్యక్షుడిగా తర్రే గణేష్, ప్రధాన కార్యదర్శిగా లింగాల రవీందర్, కోశాధికారిగా లింగంపల్లి సుదర్శన్ను నియమించారు.ఈ సందర్భంగా కట్కూరి రమేష్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన మండల, గ్రామ కమిటీలు ఈరోజు నుంచి పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా నిర్వహించేందుకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని, బహుజన రాజ్య స్థాపన లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని కట్కూరి రమేష్ సూచించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు కట్కూరి శంకర్, కాదాసు మహేందర్, పోసు తిరుపతి, గసికంటి సురేష్, కట్కూరి అనోక్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన మండల, గ్రామ కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు.

## నేరేడ బాలరాజుకు ఘన నివాళులు

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (దేశ టైమ్స్):**





నేరేడ బాలరాజు మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. బాలరాజు మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని బానోతు కొండ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో వేమూరి ప్రసాద్, బాజీ, మున్న, సిద్ధు, భూషి, పత్తిపాటి సురేష్, నవీన్, సంపత్, షేక్ జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**వలిగొండ,ఆగస్టు17(దేశ టైమ్స్)**




మండల స్థాయి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నూతనంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 21 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, 16 మంది బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఎంఈఓ భాస్కర్, వైద్యాధికారి జ్యోతి, ఏఈ సందీప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# వలిగొండకు బాలుర సంక్షేమ వసతి గృహం మంజూరు చేయాలి

**వలిగొండ ఆగస్టు17(దేశ టైమ్స్):**



మండల కేంద్రంలో బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ. మండల కేంద్రంలో గతంలో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉండేవని, వాటిని ఎత్తివేయడంతో పేద విద్యార్థులు చదువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని గతంలో ఎత్తివేసిన హాస్టళ్ల స్థానంలో ఒక జనరల్ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండల కేంద్రంలో బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రహీం, రాకేష్, సాయి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలి”

**పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.. ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 17**



పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిరంతరాయంగా కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మరిపెడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు బీఆర్ఎస్ పార్టీ తరఫున వినతిపత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఎంపీడీవో, తహసీల్దార్ (ఎమ్మార్వో), మండల ప్రభుత్వ వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ రావు మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సాయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాలు వివాహ సమయంలో అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను అధికారులు త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అందే ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో విలువైనదని, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరిగితే లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, అర్హతలను పరిశీలించి, అర్హులైన వారికి సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలను అమలు చేయాలి

**నల్లగొండ: (దేశ్ టైమ్స్) :**

గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాద్ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి ‘నోముల భగత్’ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని కలెక్టర్ ఆఫీస్ ఎదుట టి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించి అనంతరం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి షాద్ ముబారక్ పథకాలను రద్దు చేయడానికి పూనుకుంటుంది అని అన్నారు ఈ పథకాలపై కోర్టులో కేసు ఉన్నప్పటికీ కోర్టులో ప్రభుత్వంసరైన వాదన వినిపించకుండా నిర్లక్ష్యం చేస్తూ పథకాలను పరోక్షంగా నిర్వీర్యం చేస్తుంది అని అన్నారు నల్లగొండలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులు విషయంలో అనరులకు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించి సరియైన లబ్ధిదారు ఎంపిక చేసి వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్ గ్రంథాలయ మాజీ అధ్యక్షులు రేగటి మల్లికార్జునెడ్డి మున్సిపల్ మా జీ చైర్మన్ మందడి సైదిరెడ్డి అభిమన్యు శ్రీనివాస్ నగరం మండల పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్ రెడ్డి కార్పొరేటర్లు పెరికే యాదయ్య పేర్ల అశోక్ గోపగాని స్వాతి రాజశేఖర్ దండంపల్లి సత్తయ్య కందుల లక్ష్మయ్య సుంకి రెడ్డి వెంకట్ రెడ్డి రావుల శ్రీనివాస్ రెడ్డి రత్నగిరిశ్రీనివాస్ కుందూరు ప్రవీణ్ రెడ్డి జాంగిర్ టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

**పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**

**మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**హైదరాబాద్, ఆగస్టు 17:**



జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలిరాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

**జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు**

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు**

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు. ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలిచిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.

**రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్**

సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# రైతు బీమా, కల్యాణలక్ష్మి బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**మరిపెడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**

**జాతీయ రహదారిపై నిరసన**

**మాజీ మంత్రి డి .ఎస్.రెడ్యా నాయక్,**

**మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆధ్వర్యంలో ఆందోళన**

**(దేశటైమ్స్)మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 17:**





రైతు బీమా పథకాన్ని వెంటనే అమలు చేయడంతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ జిల్లామరిపెడ మండల కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై చేపట్టిన ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి డి .ఎస్. రెడ్యానాయక్ మాట్లాడుతూ.. రైతులు, పేదలు, ఆడపిల్లల కుటుంబాలకు గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు అండగా నిలిచే రైతు బీమా పథకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి అనుకోని ఆపద ఎదురైన సమయంలో రైతు బీమా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని, అలాంటి కీలకమైన పథకాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు.

**రైతు కుటుంబాలకు భరోసా కల్పించాలి**

రైతు బీమా పథకం ద్వారా గతంలో రైతు కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలిగిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాల్లో కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా బీమా పరిహారం ఎంతో ఉపయోగపడేదని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతు బీమా పథకాన్ని వెంటనే అమలు చేసి, అర్హులైన రైతులందరికీ ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేశారు.

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ బకాయిలు చెల్లించాలి**

పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సహాయంగా అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని నాయకులు కోరారు. వివాహాలు పూర్తయినప్పటికీ ఆర్థిక సహాయం అందకపోవడంతో పేద కుటుంబాలు అప్పుల భారాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మొత్తాలను సత్వరమే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో సకాలంలో చెల్లింపులు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చి లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించామని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలులో జాప్యం ఏర్పడిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం**

రైతులు, పేదల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులు, పేదల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280